

డిటో....

"హలో...."

"కమలాకర్‌గారున్నారా?"

"పిలుస్తాను ఆగండి."

....

"కమలాకర్ స్పీకింగ్...."

"నేను.... కన్యని...."

"ఏమిటి?"

"ఏమీలేదు. మీకు ఫోన్ చెయ్యాలనిపించింది- చేసాను."

''ఊహూ....''

''మరయితే మాట్లాడండి.''

''....''

''సాయంత్రం ఏ సినిమాకో వెళ్దామని మీకు ఫోన్ చేస్తే జవాబు కూడా ఇవ్వరేం? అయినా ముందు ఫోన్ చెయ్యడం నాదే తప్పులెండి.''

''అది కాదు కన్యా....''

"ఏదికాదు? వలచి వచ్చిన వాళ్ళని ఛీ కొట్టడం, ఛీ కొట్టిన వాళ్ళ వెంట పడడం మీ మగవాళ్ళకి అలవాటే కదా! బుద్ధి తక్కువై ఫోన్ చేసా. నేను మళ్ళీ చెయ్యనుగాక చెయ్యను.''

''....''

''మాట్లాడినా, పోట్లాడినా కూడా నోరు మెదపరేం? అల్ రైట్, అదీచూస్తాను....''

* * *

"హలో ..."

''కన్యాగారున్నారండీ?''

''పిలుస్తాను ఆగండి....''

''కన్యా స్పీకింగ్!''

''నేను కమలాకర్ ని.''

''ఏమిటి?''

''నామీద కోపం వచ్చిందా? ఇందాక నువ్వు ఫోన్ చేసింది మా ఆఫీసర్ దగ్గరకి. ఎవరికి ఫోన్ వచ్చినా ఆయన చెవులు అటే వుంటాయి. అందుకని ఇందాక నువ్వు ఫోన్ చేస్తే సరిగ్గా మాట్లాడలేకపోయాను.''

''అలాగా?''

''అలా పొడిపొడిగా మాట్లాడకు కన్యా, ప్లీజ్.... నీకు కోపంవచ్చి వుంటుందనే భయంతోనే నేనిలా ఆఫీసు బయటకి వచ్చి నీకు ఫోన్ చేస్తున్నాను.''

''సరే....''

"మా ఆఫీసర్ వట్టి వెధవ కన్యా! సాయంత్రం సినిమాకు వెళ్దామని నీకు ఫోన్‌లో చెప్పడం విన్నాడంటే సాయంత్రం ఆఫీసులోనే లేటయ్యేటట్లు నాకేదో పని చెప్తాడు.''

''ఊహూ....''

''ఇంకా నా మీద కోపం తగ్గలేదా? కన్యా! ప్లీజ్ కాస్త నోరు విప్పి మాట్లాడు... ''

''ఇందాకటి నీ స్థితి గుర్తు తెచ్చుకో. అదే నా పరిస్థితి. అవతల అర్జంటు పనుంది. వుంటా."

(ఉదయం వారపత్రిక)